క్లుప్తంగా

నేడు మొయిళ్లచెరువులో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్ల చెరువులో గురువారం ఉదయం 7 గంటలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రజా నాయకుడు సాయినాథ్ శర్మలు పర్యటించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మానవత్వం చాటుకున్నారు



అంత్యక్రియలను నిర్వహిస్తున్న మేఐహెల్ప్‌యూ సభ్యులు

జమ్మలమడుగు : అనాథ మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహించి మానవత్వం చాటుకుంటున్నారు మేఐహెల్ప్‌యూ సంస్థ సభ్యులు. బుధవారం పట్టణంలోని నాగులకట్ట ప్రాంతానికి చెందిన మదనకొల్ల లక్షుమయ్య అనే వృద్ధుడు అనారోగ్యంతో మరణించాడు. అతని అంత్యక్రియలకు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో స్థానికుల సమాచారం మేరకు మేఐహెల్ప్‌యూ ఫౌండర్ లక్ష్మన్‌మోరే తన సిబ్బందితో కలిసి అంత్యక్రియలను నిర్వహించారు. కార్యక్రమంలో సుభహాన్, మునేంద్ర, రాజశేఖర్, వెంకటలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

వేముల : సాధారణ ఎన్నికల్లో పోలింగ్ రోజు ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని మబ్బుచింతలపల్లె గ్రామంలో బుధవారం రాత్రి ఎస్ఐ ధనుంజయుడుతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు పూర్తి అయ్యే వరకు గ్రామంలో ఎలాంటి ఘర్షణలకు తావివ్వరాదని, శాంతియుతంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఎవరికి వారు సొంత నిర్ణయాలు తీసుకుని గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ




దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న సహాయ కమిషనర్ ముకుందరెడ్డి

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బుధవారం రూ.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల పట్టణం మహేశ్వరనగర్‌కు చెందిన రైల్వే కాంట్రాక్టర్ తుంగా మహేశ్వరరెడ్డి ఆయన సతీమణి అమృతలక్ష్మిలు విరాళం మొత్తం ఇచ్చారన్నారు.వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం ప్రారంభం

తొండూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 3 గంటలకు తేళ్లూరు, తుమ్మలపల్లె గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని రాష్ట్ర డైరెక్టర్లు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైఎస్ఆర్‌సీపీలో చేరిక



వైఎస్ఆర్‌సీపీలో చేరిన ఎస్టీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్ర నాయక్

చక్రాయపేట : తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బుక్కే రామచంద్రనాయక్ బుధవారం మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరారు. కె.ఎర్రగుడి గ్రామం బీఎస్ తాండాకు చెందిన ఆయన పాతికేళ్లపాటు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చిందని ఆయన తెలిపారు.

పింఛన్ కోసం వృద్ధుల అవస్థలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సామాజిక భద్రత పింఛన్లు తీసుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండానే ఇంటి వద్దకే సీఎం జగనన్న పింఛన్ డబ్బులు ఠంఛన్‌గా 1వ తేదీన ఇచ్చే సంస్కృతిని తీసుకువచ్చారు. అయితే ఎన్నికల పుణ్యమా అని టీడీపీ నాయకుడు చంద్రబాబునాయుడు నీతిమాలిన సంస్కృతికి తెరతీశారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయవద్దని చెప్పడంతో ఈసీ వలంటీర్లను విధులకు దూరం చేసింది. దీంతో ఈ నెల పింఛన్ తీసుకునే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛన్ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సచివాలయాల వద్ద పంపిణీ చేస్తారని కొందరు, ఇంటి వద్దకే పింఛన్లు తీసుకువస్తారని కొందరు చెప్పడంతో పింఛన్ తీసుకునే వారిలో అయోమయం నెలకొంది.



లింగాలలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వికలాంగులు



ఎర్రగుంట్ల సచివాలయంలో వేచి ఉన్న పింఛన్‌దారులు

కమలాపురం : స్థానిక సచివాలయాల వద్దకు బుధవారం ఉదయం నుంచి భారీ సంఖ్యలో పింఛన్‌దారులు చేరుకున్నారు. అయితే సచివాలయ ఉద్యోగులు బ్యాంకులకు వెళ్లి డబ్బులు తీసుకుని వచ్చేవరకు పింఛన్‌దారులకు ఇబ్బందులు తప్పలేదు. కొందరు రోగులు ఆసుపత్రులకు వెళ్లాలనే తొందరలో సచివాలయం వద్దకు వచ్చినా బ్యాంకు సమయం కాక పోవడంతో డబ్బులు ఇవ్వడం కొంత ఆలస్యం అయింది. దీంతో వారికి నిరీక్షణ తప్పలేదు. మనకు మళ్లీ జగనన్నే సీఎం కావాలని, చంద్రబాబు సీఎం అయితే ఇలా తమకు పాట్లు తప్పవని వృద్ధులు, వికలాంగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : సచివాలయాల వద్ద పింఛన్లు పొందడానికి వృద్ధులు నానా అవస్థలు పడ్డారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ నిలిచిపోవడంతో బుధవారం సచివాలయాల వద్దకే పింఛనుదారులు వరుస కట్టారు. వృద్ధులు తమ వారిని ఆసరాగా తీసుకుని సచివాలయం వద్దకు వచ్చి పింఛను పొందాల్సివచ్చింది. సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేశారు.

తొండూరులో..

తొండూరు : మండలంలోని సచివాలయాల వద్ద మండుటెండలో వృద్ధులు క్యూలో కట్టారు. ఇప్పుడే ఇలా ఉంటే ఎన్నికలు జరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా పరిస్థితి ఏమిటంటూ వారు వాపోతున్నారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తిరిగి వలంటీర్ వ్యవస్థ పునరావృతమై మాలాంటి వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు సమస్య లేకుండా చూడాలన్నారు.

వేములలో..

వేముల : ఇళ్ల వద్దకే వలంటీర్లు ఫించన్ పంపిణీ చేస్తుండటంతో వృద్ధులకు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. చంద్రబాబు చలువ వల్లే పింఛన్‌ల కోసం అవస్థలు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. ఇళ్ల వద్ద నుంచి ఎండలో నడుచుకుంటూ సచివాలయాలకు వెళ్లాలంటే వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మా ఉసురు చంద్రబాబుకు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.

లింగాలలో..

లింగాల : లింగాల మండల వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఫించన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఫించన్ల కోసం నిరీక్షిస్తున్నారు. సర్వర్ సరిగా పనిచేయకపోవడం, గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వృద్ధులను, వికలాంగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ముద్దనూరు సచివాలయం వద్ద పింఛనుకోసం వచ్చి ఇబ్బందిపడుతున్న వృద్ధురాలు

చక్రాయపేటలో..

చక్రాయపేట : తెల్లారందే వలంటీర్లు ఇంటికి వచ్చి తలుపు కొట్టి మరీ పింఛను ఇస్తుంటే ఆనందంగా ఉంటిమి. ఈపొద్దు ఏంది నాయనా ఇంత ఇబ్బంది పడుతున్నాం. మాకు ఇబ్బందులు పెట్టినోల్లు మా ఉసురు కొట్టుకు పోతారని వృద్ధులు మండి పడ్డారు. సచివాలయం వద్ద పింఛన్లు ఇస్తున్నారని తెలుసుకున్న అవ్వాతాతలు,అక్క చెల్లెమ్మలు ఆదార్ కార్డులు చేత బట్టుకుని సచివాలయం వద్దకు చేరుకున్నారు. ఒక్క సారిగా వారు పచివాలయ సిబ్బందిని చుట్టుముట్టి మాకు మందు అంటే మాకు ముందు అంటూ తొక్కిస లాట పడ్డారు. దొంగ సచ్చినోళ్లు ఇంత ఇబ్బంది పెడుతార. రేపు ఓట్లు అడగను మావూర్లోకి వస్తే చంద్రబాబు మనుషులకు ఉంటాదని మండి పడ్డారు. కొందరైతే ఇంత రద్దీలో ఎట్లా తీసుకోవాల పింఛను మళ్లీ రేపు వస్తా మంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఇళ్లకు తిరిగి వెళ్లారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయవద్దంటూ చంద్రబుబు అనడంతో పింఛన్ డబ్బులు కొసం ఆటోలలో రావాల్సివస్తోందని వృద్ధులు వాపోతున్నారు. ఉదయం నుంచి వేచి ఉన్నారు. అయితే సాయంత్రం పింఛన్ డబ్బులు పంపిణీ చేపట్టారన్నారు.



కమలాపురంలో సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు



వేములలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు



తొండూరులో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధ వికలాంగుడు



చక్రాయపేట సచివాలయంలో పింఛన్ల కోసం తొక్కిస లాట పడుతున్న అవ్వా తాతలు

ఐదు రోజులుగా ఆరోగ్యం బాగాలేదు..



నాకు ఎవరూ లేరు. జగనన్న ఇచ్చే పింఛన్ డబ్బులతోనే జీవనం సాగిస్తున్నాను. ఈనెల 1వ తేదీ పింఛన్ రాలేదు. ఐదు రోజులుగా కడుపులో నొప్పి ఉంది. ఆరోగ్యం బాగాలేదు. ఇక్కడి ఆసుపత్రిలో చూపిస్తే కడప రిమ్స్‌కు వెళ్లన్నారు. రిమ్స్‌కు వెళ్లడానికి డబ్బులు లేవు. జగనన్న సీఎం అయ్యాక పింఛన్ డబ్బుల కోసం ఏనాడు ఇబ్బంది పడలేదు. ప్రతి నెలా ఇంటికే వచ్చి వలంటీర్ పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు ఎన్నికల పుణ్యమా అని పింఛన్ డబ్బులు రాలేదు. డబ్బు కోసం సచివాలయం వద్దకు వస్తే మధ్యాహ్నం ఇస్తామంటున్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ పంపించాలి.

-షేక్ మౌలాలి, అంధుల కాలనీ, కమలాపురం

వలంటీర్లు వల్ల మాకు ఇంటికే పింఛన్ వచ్చేది..



వలంటీర్లు ఉండటం వల్ల మాకు తెల్లవారిజామునే పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు ఏవరి పుణ్యామో కానీ మళ్లీ ఎండలో వేచి ఉండాల్సి వస్తుంది. ఐదేళ్ల పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ ద్వారా మాకు అన్ని ఇంటి వద్దకే వచ్చేవి.

-రెడ్డెమ్మ, సుందరయ్య నగర్ కాలనీ, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ

మాలాండోలకు సాయం చేయడం ఆయనకు ఇష్టం లేదేమో



నడిచేందుకు కష్టంగా ఉన్న మాకు వాలంటీర్లు తెల్లవారుజామున ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చేవారు, ఇప్పుడు తెలుగుదేశం వాళ్ళు వాళ్ళ రాజకీయాల కోసం వాలంటీర్లను పింఛన్లను పంపిణీ చేయకుండా చేశారు. మాలాంటి వాళ్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కుంటివాళ్లు గుడ్డివాళ్లు ముసలోళ్ళు ఎండకు సచివాలయానికి వెళ్లాలంటే ఆటోలు బాడెక్కు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ పాపం చంద్రబాబునాయుడుకు కచ్చితంగా తగులుతుంది.

-కంచన సుబ్బరామయ్య, బుగ్గలేటిపల్లి, చింతకొమ్మదిన్నె మండలం

ఇఫ్తార్ విందు



లింగాలలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్ అభిషేక్‌రెడ్డి

లింగాల : స్థానిక మసీదులో బుధవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వైఎస్ అభిషేక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల యూత్‌కన్వీనర్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, తదితరులు

నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ పివిసుబ్బారెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ గ్రామాల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల : స్థానిక ముస్లిం సోదరులకు రంజాన్ మాసం పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డిలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జిల్లా కమిటీలో చోటు దక్కడం హర్షణీయం

కమలాపురం : కమలాపురం వాసులకు జిల్లా ఆర్య వైశ్య కమిటీలో చోటు దక్కడం, అందులోనూ 9 మందికి పదవులు రావడం హర్షణీయం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఇటీవల జిల్లా ఆర్యవైశ్య కమిటీ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన లక్ష్మీదేవి, జయశ్రీ, రమణయ్య, అంబటి సురేష్, మల్లికార్జున, సుధాకర్, సుబ్రమణ్యం, రెడ్డి సురేష్, చంద్రశేఖర్ తదితరులను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి శాలువ కప్పి, పూల మాలలతో సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులందరూ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పనితీరులో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కమిటీలో సైతం కమలాపురం వాసులు చోటు దక్కించుకోవాలన్నారు. పేద ఆర్యవైశ్యులను గుర్తించి వారిని ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలన్నారు.

వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా

తొండూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉన్న వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. బుధవారం మండలంలోని మల్లేల గ్రామానికి చెందిన 13 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తొండూరు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ విష్ణుప్రసాద్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేసి మాట్లాడారు. ప్రతిపక్షపార్టీలు తమపై అనుచిత వ్యాఖ్యలు చేసి మా మనసులను గాయపడేవిధంగా మాట్లాడారన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో కూడా మాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల మనస్తాపానికి గురై రాజీనామా చేశామన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలను బుధవారం వార్డు అడ్మిన్ సెక్రటరీతో కలసి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యకు అందజేసి మాట్లాడారు. జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిల గెలుపు కోసం స్టార్ క్యాంపెయినర్‌లుగా ఉండి ప్రజలకు మన ప్రాంతానికి చేసిన అభివృద్ధి గురించి వివరించాలనే ఉద్దేశంతో తమ రాజీనామాలు చేసినట్లు వారు తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మండలంలోని గూడెంచెరువు గ్రామానికి చెందిన 10 మంది వలంటీర్లు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని మండలాధికారికి తమ రాజీనామా పత్రాలను అందజేసి మాట్లాడారు. టీడీపీ నాయకులు తమను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తమను ప్రజా సేవ చేయకుండా అడ్డుపడ్డారన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం జగనన్నతోనే సాధ్యం

పెద్దముడియం : రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని జమ్మలమడుగు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పాలూరు, నాగరాజుపల్లె గ్రామంలో ఆయన మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతిపక్ష పార్టీలు పన్నుతున్న కుట్రలకు లొంగకుండా ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జగనన్న ఐదేళ్ల పాలనలో మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సాంబశివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలి

వీరపునాయునిపల్లె : మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో చంద్రబాబునాయుడుకు తగిన బుద్ధి చెప్పాలని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని అనిమెల గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబునాయుడులో దాగి ఉన్న రాక్షసత్వం బయట పడిందన్నారు. చంద్రబాబు ప్రస్తుతం ఎన్నికల వేల కుట్ర పూరితంగా వలంటీర్ సేవలను అడ్డుకున్నారన్నారు. ప్రస్తుతం పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. చంద్రబాబుకు వారి ఉసురు కొట్టుకోకపోదన్నారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ నరేష్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ శ్రీనివాసుల్‌రెడ్డి, గడ్డంవారిపల్లె సహకారం అధ్యక్షుడు రఘునాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పాలూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ పాలనలో మీ ప్రాంత అభివృద్ధికి మీ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాలంటే జగనన్నకు ఓటేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని గొళ్లపల్లె, నలతిమ్మాయపల్లె, జంభాపురం, పాచికలపాడు గ్రామాల్లో ఆమె ఎంపీపీ గండి భారతితో కలసి ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. వైఎస్ అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో వారిని గెలిపించాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజు పాశం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, గొళ్లపల్లె శ్రీనివాసరెడ్డి, ఇందిరెడ్డి శ్రీనువాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : సంక్షేమ, అభివృద్ధి ప్రదాతకు అండగా నిలుద్దామని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి అన్నారు. బుధవారం కొత్త గాంధీ నగర్, బెస్త కాలనీ, బుడ్డాయపల్లె కాలనీలలో ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ అధ్యక్షుడు పులి సునీల్‌కుమార్, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, లేవాకు బాబు, చంద్ర, నగలారపు బాబు, జీఎస్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



వీఎన్‌పల్లె : చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని ముద్దనూరురోడ్డు, సదాశివారెడ్డి హాస్పిటల్, చిన్నన్నరూములు, నగరిగుట్ట ప్రాంతాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలన్నారు. అలాగే మాజీ జడ్పీటీసీ చైర్మన్ జ్యోతిరెడ్డి, ఆమె భర్త సదాశివారెడ్డిలను ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. చైర్మన్‌లు వరప్రసాద్, చిన్నప్ప, సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, నూరుబాషా సంఘ కార్పొరేషన్ చైర్మన్ రసూల్ పాల్గొన్నారు.

లింగాల : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను అభివృద్ధిని చూసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నకుడాల గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించిన మాట్లాడారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను మరోసారి ఆశీర్వదించాలని వైఎస్ అవినాష్‌రెడ్డి బావమరిది, ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి ప్రజలను అభ్యర్థించారు. బుధవారం మండలంలోని పైడిపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు.



పులివెందులలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

చక్రాయపేట : మామకు వెన్ను పోటుపొడిచి దొడ్డిదారిన ముఖ్యమంత్రి అయ్యి ప్రజలను మోసం చేస్తూ వస్తున్న చంద్రబాబును ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణలతో కలసి కె.ఎర్రగుడి గ్రామంలోని బీఎస్ తాండా, గరుగుతాండాలలో తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి జగన్నను, ఎంపీ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, సర్పంచ్ హరిశేఖర్‌నాయుడు, మండల ఉపాధ్యక్షుడు అబ్దుల్ గఫూర్, ఉపసర్పంచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండలంలోని టీ సుంకేసుల గ్రామంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించి వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ప్రజలను కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల వీరభాస్కర్ రెడ్డి, సహదేవరెడ్డి, ఎర్రగుడి శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి, మోగిశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



చక్రాయపేట : గత ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ కొండారెడ్డి



కమలాపురం : గొళ్లపల్లెలో ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి



చెన్నూరు : ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి



లింగాలలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి



సింహాద్రిపురంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి